# 20 నుంచి ఆపద మిత్ర పథకం అమలు

- రిసోర్స్ పర్సన్లను గుర్తించాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి వివిధ శాఖల సమన్వయంతో శిక్షణకు రిసోర్స్ పర్సన్స్ వలంటీర్లను గుర్తించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఆపదమిత్ర పథకం అమలుపై వివిధ శాఖల వలంటీర్లు, రిసోర్స్ పర్సన్స్ గుర్తింపుపై, జిల్లా యువజన క్రీడల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో డీఆర్‌డీవో, మెప్మా, హెల్త్, రెవెన్యూ, ఫైర్, మత్స్య శాఖ, ఇండస్ట్రీస్, అధికారులతో సమీక్ష ఏర్పాటు చేశారు. ఈ సమీక్షలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌వో భుజంగరావు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విపత్తు ప్రమాద తగ్గింపు, విపత్తు నిర్వహణ వ్యవస్థపై దృష్టి పెట్టడం, విద్యా సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, సాంకేతిక పురోగతిని ఉపయోగించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని విపత్తులను మరింత ఆచరణాత్మక రీతిలో ఎదుర్కొనడానికి, ప్రకృతి వైపరీత్యాలకు గురయ్యే అన్ని జిల్లాలను కవర్ చేస్తూ దీనిని ముందుకు తీసుకు వచ్చిందని చెప్పారు. జిల్లాలోని 18 నుంచి 40 ఏండ్ల వారు ఆసక్తి గల యువత, NCC, NSS విద్యార్థులు, ఎక్స్ సర్వీస్‌మెన్, సివిల్ డిఫెన్స్ ఉద్యోగులు, మహిళా సంఘాల వారు రిసోర్స్ పర్సన్స్, వలంటీర్లను జిల్లా నుంచి 200 మందిని ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఇందిరా, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, మత్స్య శాఖ అగ్నిమాపక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు**

హోలీ పండుగను ఆనందంగా, భద్రతతో, సంప్రదాయాలను పాటిస్తూ జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బావులు, వాగులు, చెరువులు, నదుల్లో స్నానాలకు వెళ్లొద్దని, సరదా మాటున ప్రమాదం పొంచి ఉందని సూచించారు. రంగులతో చిన్నపిల్లలు జాగ్రత్తగా ఆడాలన్నారు.

## పండుగ స్పెషల్ పేరిట ఆర్టీసీ బాదుడు



టికెట్‌ను చూపుతున్న ప్రయాణికుడు

చిలిపిచెడ్, మార్చి 13: హోలీ పండుగ వేళ ఆర్టీసీ బస్సుల్లో అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. నర్సాపూర్ డిపో నుంచి చిలిపిచెడ్ మండలంలోని ఫైజాబాద్ గ్రామం మీదుగా జోగిపేటకు వెళ్తున్న ఆర్డినరీ బస్సులో ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఫైజాబాద్ గేట్ నుంచి జోగిపేటకు ఆర్డినరీలో రూ.20 ఉంది. హోలీ పండుగ పేరిట ఆదే బస్సుకు ఎక్స్‌ప్రెస్ టికెట్టు రుసుం రూ.30 వసూలు చేశారు. దీంతో బండపోతుగల్ గ్రామానికి చెందిన ప్రయాణికుడు అవాక్కయ్యాడు.

## పరిస్థితి విషమించి బాలింత మృతి



అవంతిక (ఫైల్)

రామాయంపేట, మార్చి 13: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలింత మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో బుధవారం రాత్రి జరిగింది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోనాపూర్‌కు చెందిన మామిడి అవంతిక (23) ప్రసవం కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత అవంతిక కోమాలోకి వెళ్లింది. దీంతో వైద్యుల సూచనల మేరకు కుటుంబీకులు బిడ్డకు కామారెడ్డిలోనే చికిత్సలు నిర్వహించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు. అక్కడ మూడు రోజులుగా చికిత్సలు నిర్వహించారు. బుధవారం రాత్రి పరిస్థితి విషమించి అవంతిక మృతి చెందింది. అవంతిక మృతదేహాన్ని కోనాపూర్ తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు.

## కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 13: ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ప్రథమ సంవత్సరం గణితం–బీ, హిస్టరీ–1, జువాలజీ–1 పరీక్షలకు 5,292 మందికి 5,142 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి మాధవి తెలిపారు. జనరల్‌లో 4,634 మందికి 4,513, ఒకేషనల్‌లో 658 మందికి 629 మంది విద్యార్థులు మొత్తం 97.16 శాతం హాజరయ్యారు.

## బదిలీలు సర్వ సాధారణం



నిజాంపేట, మార్చి 13: ఉద్యోగికి బదిలీలు సర్వ సాధారణమని ఎంఈవో యాదగిరి అన్నారు. రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో 12 ఏండ్లు పని చేసిన ఉపాధ్యాయురాలు కవిత బదిలీపై కాట్రియాల్ పాఠశాలకు వెళ్లారు. గురువారం రాంపూర్ పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించి కవితకు సన్మానించారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మారెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పరశురాములు ఉన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



చిలిపిచెడ్, మార్చి 13: మండలంలోని చిట్కుల్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ లక్ష్మీప్రసన్న మత్తు పదార్థాలపై మహిళలకు గురువారం అవగాహన కల్పించారు. పిల్లలకూ మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచాలని, వాటితో కలిగే చెడు ప్రభావాన్ని తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో చిట్కుల్ అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, షహనాజ్ బేగం పాల్గొన్నారు.

## హోలీ శుభాకాంక్షలు

మెదక్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని అన్ని వర్గాల ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులు, అధికారులు, ప్రజలందరికీ టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MOHAMMED MUBEEN AHMED, S/o. Mohammed Sadiq Ali, R/o. H.No. 3-4-26/3, Momin Mohalla, Zaheerabad, Sangareddy Dist., T.S. I have Changed My Name from MOHAMMED ABDUL MUBEEN AHEMAD to MOHAMMED MUBEEN AHMED.

NT-Narsa

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఘనంగా మహిళా దినోత్సవం



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ

మెదక్ అర్బన్, మార్చి 13: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు మన ఇంట్లో నుంచే మగ పిల్లలు, ఆడ పిల్లలను సమానంగా చూడాలన్నారు. మగ పిల్లలకు ఇచ్చే స్వేచ్ఛను ఆడపిల్లలకూ ఇస్తూ మంచి విద్యను అందించాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సంగమేశ్వర్ కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, మార్చి 13: పట్టణానికి చెందిన వ్యాపారవేత్త బల్‌రాం సంగమేశ్వర్ మృతి చెందాడు. దీంతో నారాయణఖే మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అక్కడకు వెళ్లి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కమలాపురం గ్రామానికి చెందిన పెంటయ్య మృతి చెందాడు. అతడికి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు మాణిక్‌రెడ్డి, సుభాశ్, యాదూల్, రాములు, భూపతిపాండు, తుకారాం, రాములు తదితరులున్నారు.

## రాజకీయ పార్టీలతో సమావేశాలు పూర్తి చేయాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

మెదక్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): ఈ నెల 19 లోపు ఓటరు జాబితా సవరణ, ఇతర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ కార్యాలయం నుంచి ఆయన సమావేశాల నిర్వహణపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్, మెదక్ ఆర్డీవో రమాదేవి సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో ప్రతి 3 నెలలకోసారి పకడ్బందీగా నవీకరించాలన్నారు. 18ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితా సవరణ, పోటీ చేసిన అభ్యర్థుల వివరాలు, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం, తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈనెల 19లోపు సమావేశాల నిర్వహించాలని ఆదేశించారు. సమావేశానికి హాజరైన వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని, అందుకు ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశాలకు సంబంధించిన వివరాలను 27 లోపు ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలన్నారు.

## 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు



ఎస్ఈ శంకర్‌తో రామాయంపేట విద్యుత్ సిబ్బంది

రామాయంపేట, మార్చి 13: వినియోగదారులకు నిరంతరం విద్యుత్ అందించడం కోసం సబ్‌స్టేషన్‌లో అదనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ 5ఎంవీఏను బిగించినట్లు విద్యుత్ ఎస్ఈ శంకర్ అన్నారు. గురువారం మండలంలోని ఝన్సీలింగాపూర్‌లో 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. వినియోగదారులు తమ నెలవారి బిల్లులను సక్రమంగా చెల్లించాలన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న వ్యవసాయ, గృహ వినియోగదరులకు ఇక నుంచి విద్యుత్‌తో ఎలాంటి ఇబ్బందులుండవన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ కోసం మాజీ సర్పంచ్‌గా పంబాల జ్యోతి శ్రీనివాస్ వినతి పత్రం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఈ సోమేశ్వర్, రామాయంపేట ఏడీఈ ఆదయ్య, ఎంఎస్‌పీ ఏడీ సుధాకర్, ఏఈ తిరుపతిరెడ్డి, వెంకటేశం, రామాయంపేట విద్యుత్ డివిజన్ లైన్‌మెన్లు పంబాల శ్రీనివాస్, మహేందర్ తదితరులు ఉన్నారు.

## ప్రజాభిప్రాయం సేకరించకుండానే నిర్ణయం

- దొంగ సర్వే చేసి, జీవో తెచ్చి డంపింగ్ యార్డు కడుతున్నారు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాధా మల్లేశ్‌గౌడ్



నర్సాపూర్‌లో నిరాహారదీక్షలో పాల్గొన్న బీజేపీ మెదక్ అధ్యక్షుడు రాధామల్లేశ్‌గౌడ్

నర్సాపూర్, మార్చి 13: కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ జీవో తెచ్చి, దొంగ సర్వే చేసి దొంగతనాన డంపింగ్ యార్డు నిర్మాణాన్ని చేపడుతున్నదని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు రాధా మల్లేశ్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం నిర్మిస్తున్న జీహెచ్‌ఎంసీ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్ష గురువారం నాటికి 25వ రోజుకు చేరుకున్నది. దీక్షలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాధామల్లేశ్‌గౌడ్ నిరాహారదీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాన్ని సేకరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తూతూమంత్రంగా సర్వే చేపట్టి, డంపింగ్‌యార్డు నిర్మిస్తున్నదన్నారు. ప్రజల ప్రాణాలు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం డంపింగ్‌యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పచ్చని అడవిలో 152 ఎకరాల్లో పోలీస్ పహారాతో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడం సిగ్గుచేటన్నారు. దీంతో సుమారు 13 కిలో మీటర్ల వరకు దుర్గంధం వ్యాపిస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యాలు పాడవుతాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కూడా ముందుకొచ్చి ఈ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుబ్రహ్మణ్యం, రమేశ్‌గౌడ్, నారాయణరెడ్డి, దిగంబర్‌రావు, శంకర్ పాల్గొన్నారు.

## పూరిల్లు దగ్ధం

చిన్నశంకరంపేట, మార్చి 13: పూరిల్లుకు నిప్పంటుకుని దగ్ధమై రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిన ఘటన మండలంలోని రుద్రారంలో బుధవారం చోటుచేసుకుంది. రుద్రారం గ్రామానికి చెందిన ముత్తిగళ్ల బాబుకు చెందిన పూరింటి నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. ప్రమాదంలో రూ.15 వేల నగదుతో పాటు అర తులం బంగారం 20 తులాల వెండి పట్టగొలుసులు, బీరువా బట్టలు, వంట సామగ్రి కాలి బూడిదయ్యాయి. బాధితులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రేషన్ డీలర్ కుటుంబానికి ఆర్థిక సాయం



రేషన్ డీలర్ కుటుంబానికి సాయం అందజేసిన బీఆర్ఎస్ నాయకుడు రంగయ్య

చేగుంట, మార్చి13: చేగుంట మండలం రెడ్డిపల్లి కాలనీలో ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రేషన్ డీలర్ మద్దూరి ప్రభాకర్ కుటుంబానికి బీఆర్ జిల్లా నాయకుడు రంగయ్యగారి రాజిరెడ్డి గురువారం క్వింటల్ బియ్యం అంజేశారు.

## రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్- 14 బాలికల ఫుట్‌బాల్ పోటీలకు నలుగురు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 13: రాష్ట్రస్థా యి ఎస్‌జీఎఫ్ అండర్–14 బాలికల ఫుట్‌బా ల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన బాలికలు సాధియా, సమిరా, సౌజన్య, చైత న్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయ్‌శ్రీ తె లిపారు. రోజూ ఔట్ డోర్ స్టేడియంలో ప్రత్యే క శిక్షణ ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల నుంచి నలుగురు బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తంచేశారు.

## విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

చేగుంట, మార్చి 13: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత లక్ష్యాన్ని చేరుతారని వికారాబాద్ ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ శివచంద్ర పేర్కొన్నారు. చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో చేగుంట ఎంఈవో నీరజ, హెచ్‌ఎం రఘుపతి, రాజేశ్వర్, సుధాకర్‌రెడ్డి, రాధా, రమా, రమాదేవి, శారద, చల్లా లక్ష్మణ్, మనోహర్‌రావు, వెంకటేశ్, సురేందర్, రేఖ, భవానీ, సరస్వతి, శ్రీవాణి, ఉమా, ఉమామహేశ్వరి, సత్యనారాయణ, యాదిరెడ్డి, విద్యార్థులు తదితరులున్నారు.

## భద్రతా నియమాలు పాటించాలి

**రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ రాజగోపాల్‌రావు**



మొక్కను నాటి నీరు పోస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ రాజగోపాల్‌రావు

మనోహరాబాద్, మార్చి 13: పరిశ్రమల యజమాన్యాలు, కార్మికులు తప్పనిసరిగా భద్రతా నియమాలను పాటించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ రాజగోపాల్‌రావు అన్నారు. మనోహరాబాద్ మండలం రంగాయిపల్లిలోని ఎంఎస్ పరిశ్రమలో 54 వ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. భద్రతతో కూడిన ఉత్పత్తి విధానానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీమతి లక్ష్మీకుమారి, పరిశ్రమ ప్రతినిధులు వసంత్‌కుమార్, చక్రవర్తి, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసు ఛేదించిన పోలీసులు

**12 తులాల బంగారం, రెండు కిలోల వెండి స్వాధీనం**



నిందితున్ని చూపిస్తున్న పోలీసులు

పెద్దశంకరంపేట, మార్చి 13: పెద్దశంకరంపేటలో మూడు రోజుల క్రితం జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి వివరాలు తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 11న విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటక రాష్ట్రం గనుగాపూర్‌కు వెళ్లారు. రోజు మాదిరిగానే ఈనెల 12న ఉదయం పని చేసేందుకు ఆసిన్‌బేగం ఇంటికి వచ్చింది. అక్కడ పని చేస్తుండగా బెడ్‌రూం తాళాలు పగలగొట్టి ఉండడంతో వెంటనే ఇంటి యజమానికి సమాచారం అందించారు. దీంతో యజమాని హుటాహుటిన ఇంటికొచ్చి పరిశీలించాడు. బెడ్‌రూంలో వెంకటేశ్వర స్వామి గుడికి సంబంధించిన ఆభరణాలు ఆరు తులాల బంగారు గొలుసు, ఐదు తులాల బంగారు గొలుసు, తులం పుస్తెమట్టెలు, రెండు కిలోల వెండి వస్తువులు రూ.6వేల నగదును దొంగలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారించి సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగను పట్టుకున్నారు. అదే గ్రామానికి చెందిన ఎర్ర నాగరాజుగౌడ్ ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనం చేసినట్లు సీఐ వివరించారు. నిందితుడి వద్ద నుంచి 12 తులాల బంగారం, రెండు కిలోల వెండి వస్తువులు, రూ.6వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు. మూడు రోజుల్లో కేసు ఛేదించడంతో పోలీసులను ఎస్పీ ఉదయ్‌కుమార్ అభినందించినట్లు తెలిపారు.

## జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు



శేరి సుభాష్‌రెడ్డి



పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): జిల్లా ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సు భాష్‌రెడ్డి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగను అందరూ కలిసి మెలిసి ఆనందంగా జరుపుకోవాలన్నారు.

## రేషన్ బియ్యం ఎప్పుడొస్తాయో?

**మార్చి మొదలై 12 రోజులు గడిచినా రేషన్ దుకాణాలకు సరఫరా లేదు**



నిజాంపేటలోని మూసి రేషన్ దుకాణం

నిజాంపేట, మార్చి 13: నెల మొదలై 12 రోజులైనా ఇప్పటి వరకు రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా కాక పోవడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. నిజాంపేట మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన 18 రేషన్ దుకాణాలు ఉన్నాయి. మార్చి ప్రారంభమై 12 రోజులు గడిచినా మండల వ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాలకు ఇప్పటి వరకు బియ్యం సరఫరా కాలేదు. రేషన్ బియ్యంపై ఆధారపడేవారు గ్రామీణ ప్రజలు దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. మండల ప్రజలు బియ్యం రాక పరేషన్ అవుతున్నారు. బియ్యం సరఫరా జరిగి ఉంటే ఈ పాటికి లబ్ధిదారులకు బియ్యం అందించేవారమని డీలర్లు చెబుతున్నారు. రేషన్ బియ్యం సరఫరా అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. రేషన్ బియ్యం ఎప్పుడస్తాయోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

## మాదిగలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం



కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ చట్టం తెచ్చే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని మెదక్ పార్లమెంటరీ ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేస్తున్నదని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. గతంలో వర్గీకరణ నాలుగు గ్రూపులుగా ఏర్పడితే ఇప్పుడు మూడు గ్రూపులు చేయడం కరెక్టు కాదన్నారు. మందకృష్ణ మాదిగ పోరాటానికి మద్దతు తెలుపాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మురళి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు మాదిగ, మెదక్ మండల అధ్యక్షుడు గట్టయ్య మాదిగ, మండల ఉపాధ్యక్షుడు యాదగిరి, సంపత్, దేవేందర్, కుంటి నాగరాజు, కుంటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


## విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 13: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని ఏవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం సమస్యలతో సతమతమవుతున్నదన్నారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీల్లో సమస్యలు తిష్టవేసుకున్నాయన్నారు. ఈ నెల 19న ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. ఆయనతో నాయకులు కార్తిక్, శాంసన్, బాలరాజు, గణేశ్ ఉన్నారు.

## తొలి కవయిత్రి మొల్లమాంబకు ఘన నివాళి



నర్సాపూర్: మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

మెదక్ మున్సిపాలిటీ/నర్సాపూర్, మార్చి 13: జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో శాలి వాహన సంఘం ఆధ్వర్యంలో గురువారం మొల్లమాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలోసంఘం అధ్యక్షుడు సంతోష్ కుమా ర్, అంజయ్య, రాములు, సిద్దయ్య, దుర్గయ్య, మహంత్, ప్రజపతి పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో..**

తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతిని నర్సాపూర్‌లో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పించారు. కుమ్మరి సంఘం నాయకులు శంకరయ్య, నగేశ్, బోవయ్య, రమేశ్, లక్ష్మణ్, చెన్నయ్య, రాజు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పిస్తాం



చిలిపిచెడ్, మార్చి 13: జాబ్‌కార్డులు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీవో ఆనంద్ సూచించారు. గురువారం అజ్జమర్రి గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఆధార్‌కార్డు కలిగి ఉండి, అర్హులైన వారు జాబ్‌కార్డులు చేయించుకోవాలని సూచించారు.

## వాటర్ డిస్పెన్సరీ అందజేత



చేగుంట,మార్చి13: చేగుంట తహసీల్ కార్యాలయానికి చందాయిపేట మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ గురువారం వాటర్ డిస్పెన్సరీ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఉప తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐలు జైభారత్‌రెడ్డి, సంతోష్‌కుమార్, ఏఈ దివ్యశ్రీ, సర్వేయర్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## మురుగు కాల్వ ప్రారంభం.. గ్రామస్తుల హర్షం

కౌడిపల్లి, మార్చి13: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి రూ.4లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో గ్రామంలో మురులు కాల్వ నిర్మాణాన్ని స్థానిక నాయకులు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, మాజీ ఎంపీటీసీలు శంకర్‌గౌడ్, కిశోర్‌గౌడ్, అంజాగౌడ్, యాదగౌడ్, గోపాల్, మొగులాగౌడ్, సత్యనారాయణ, నర్సింలుగౌడ్, శేఖర్, మల్లేశం, ప్రతాప్‌గౌడ్, వడ్ల శేఖర్, స్వామిగౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.